క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



విద్యార్థులతో నీతి కథలను చదివిస్తున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిడ్యాల: దిన పత్రికలు చదవడంతో పాటు విద్యార్థులు పుస్తకం పఠనం అలవాటు చేసుకోవడం వల్ల విజ్ఞానం వికాసం చెందుతుందని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. వేసవి తరగతుల్లో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆమె విద్యార్థులతో పంచతంత్ర పుస్తకంలోని నీతి కథలను చదివించారు. అనంతరం చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్, క్రికెట్ ఆటల్లో విద్యార్థులు నిమగ్నమయ్యారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన నూలక నాగేశ్వరరావు అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి మాజీ సర్పంచు టేకూరి రామసుబ్బమ్మ, సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు టేకూరి నాగేశ్వరరావు రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు బోనపల్లె సత్యరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివకుమార్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రవచనం వినిపిస్తున్న ప్రవాచకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై ఒంగోలుకు చెందిన ఎన్.సీతారామమూర్తి వానందలహరిపై వినిపించిన ప్రవచన కార్యక్రమం ఆకట్టుకుంది.

ఏపీ పాలిసెట్‌లో ఆత్మకూరు విద్యార్థిని ప్రతిభ



షేక్‌అర్షియా

ఆత్మకూరు: పట్టణానికి చెందిన షేక్‌అర్షియా ఇటీవల జరిగిన ఏపీ పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచింది. 100 మార్కులకు గానూ 95 మార్కులు సాధించింది. విద్యార్థినికి తల్లిదండ్రులు, గురువులు, పట్టణ వాసులు అభినందనలు తెలిపారు.

సోలార్ విద్యుత్ కేంద్రం వద్దు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారంలోని నల్లరేగడి భూములు సోలార్ విద్యుత్‌కేంద్రం ఏర్పాటుకు కేటాయిస్తే ఆందోళన చేపడ్తామని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని దళితులకు శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు కోరారు. గురువారం ఆయన పారుమంచాలలో నివాసగృహాల మధ్యనున్న దళితుల శ్మశానవాటికను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు వందేళ్ల క్రితం కేటాయించిన శ్మశానవాటిక చుట్టూ నివాసగృహాలు వెలిశాయన్నారు. గ్రామ చివరలో స్థలాన్ని కేటాయించి శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'నిరుద్యోగులను మోసం చేసిన బుద్ధ యోగా ఫౌండేషన్'

ఆత్మకూరు: నిరుద్యోగులను బుద్ధ యోగ ఫౌండేషన్ మోసం చేసిందని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే యోగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు యోగాపై విస్తృత ప్రచారం చేయడంతో కొందరు మోసగాళ్లు తెలివిగా వాడుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్‌శాఖ ఆదేశాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో యోగా తరగతులు ఉచితంగా చెబుతామని గుంటూరుకు చెందిన బుద్ధ యోగ ఫౌండేషన్ నిర్వాహకులు షేక్షావలి, లక్ష్మీనారాయణ నిరుద్యోగులను మోసం చేశారన్నారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

భవనాశి..కనుమరుగు!

- 30 ఏళ్ల క్రితం జీవనదిగా నీటి ప్రవాహం
- పూడికతో నిండి నేడు కనుమరుగుకానున్న వైనం

ఆత్మకూరు: నల్లమలలో ప్రవహించే నదులలో భవనాశి నదికి ప్రత్యేకత ఉంది. ఇక్కడే పుట్టి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని సప్త నదుల కూడలి వద్ద కృష్ణమ్మ ఒడిలో కలుస్తూ, తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకుంది. ‘భవ’ అంటే పాపం, ‘నాశి’ అంటే పోగొట్టడం అని అర్థం. సర్వపాపాలను పోగొట్టే నదిగా భవనాశికి పేరుంది. సాధారణంగా అన్ని నదులు పడమట నుంచి తూర్పునకు ప్రవహిస్తాయి. కానీ ఈ నది నల్లమలలో తూర్పున పుట్టి, పడమట సంగమేశ్వరం క్షేత్రం వద్ద అంతరిస్తుంది. ఈ నది ఒడ్డున ఇస్కాల గ్రామం వద్ద శివాలయం ఉంది. నది చివరన అత్యంత పవిత్రమైన సంగమేశ్వరక్షేత్రం కొలువుతీరి ఉంది. ఎంతో విశిష్టతతో పాటూ పాండవులు సైతం ఈ ప్రాంతంలో సంచరించినప్పుడు భవనాశిలో పవిత్ర స్నానాలు ఆచరించి ఇస్కాల గ్రామంలోని శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్కాందపురాణం తెలుపుతోంది.

నది.. వాగైంది...

ఎంతో పవిత్రతను చాటుకుని వేసవి, చలి, వర్షా కాలాలు అనే తేడా లేకుండా అన్ని కాలాల్లో ఓ జీవనదిలా భవనాశి నది అనునిత్యం ప్రవహించేది. ప్రస్తుతం ఈ నది పూడికతో నిండి తన సరిహద్దులను సైతం రూపురేఖలు కోల్పోయి కేవలం ఒక వాగులా కనిపిస్తూ నది స్వభావాన్ని కోల్పోతుంది. ఒకప్పుడు ఎంతో విశాలంగా ఉన్న ఈ నది ప్రస్తుతం అన్యాక్రాంతం కావడం శ్రీశైలం, మద్రాస్ కెనాల్ తవ్వడం వల్ల భవనాశి తన స్వరూపాన్ని కోల్పోయింది. నల్లమల నుంచి సిద్దాపురం మీదుగా ఆత్మకూరు పట్టణానికి చేరుకున్న ఈ నది ఆత్మకూరులో నది తన స్వభావాన్ని కోల్పోయింది. కొందరు ఆక్రమించుకోవడంతో నది వాగులా మారిపోయింది. పాములపాడు మండలంలో ఈ నది యథావిధిగా ఉన్నప్పటికీ చెలిమెళ్ల నుంచి కొత్తపల్లి మండలం నాగంపల్లి సమీపంలో ఎస్‌ఆర్‌ఎమ్‌సీ ఒడ్డున ఆనుకుని ఉండడంతో పూర్తి స్థాయిలో నది స్వభావం కోల్పోయింది. తిరిగి ఇదే మండలంలోని కొక్కెరంచ సరిహద్దులు దాటిన అనంతరం జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు వద్ద ఈ నది కనిపిస్తూ సంగమేశ్వర క్షేత్రం వద్ద పాయలా కృష్ణానదిలో కలుస్తూ భక్తులకు కనువిందు చేస్తోంది. కొంత దురాక్రమణ, ఎస్‌ఆర్‌ఎమ్‌సీ బ్యాక్‌వాటర్ వల్ల పూడిక నిండడం, కాల్వ గట్లు ఆనుకుని ఉండడం వల్ల నది పూడిపోవడం లాంటి ఘటనల వల్ల తన స్వరూపాన్ని పోల్పోయింది. అన్ని కాలాల్లో నీరు పుష్కలంగా ప్రవహించే ఈ నది.. ప్రస్తుతం వర్షాకాలం నుంచి చలికాలం వరకు మాత్రమే ప్రవహిస్తోంది. వేసవికాలం అసలు ఈ నదిలో చుక్కనీరు కూడా లభించే పరిస్థితి లేదు. ఇలా జీవనదిలా ఉంటూ రైతులకు పంటలకు, పశువుల దాహార్తి తీర్చే నది.. నేడు తన సరిహద్దును కోల్పోయి, కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ నదిని పూడిక తీసి, సిద్ధాపురం నీటిని మళ్లిస్తే ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావు పేట, ఆత్మకూరు, కొత్తపల్లి మండలం దుద్యాల, పాములపాడు మండలం ఇస్కాల, చెలిమెళ్లతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల పొలాలు సస్యశ్యామలం అవుతాయి.





కనుమరుగవుతున్న భవనాసి నది దృశ్యాలు

నదిని కాపాడాలి



భవనాశి నదిని ఆక్రమణకు గురికాకుండా, పూడి పోకుండా మైనర్ ఇరిగేషన్ అధికారులు కాపాడాలి. ఒకప్పుడు భవనాశి నది ఎంతో విశాలంగా లోతుగా ఉండేది. ప్రస్తుతం ఆక్రమణకు గురికావడంతో విస్తీర్ణం తగ్గడమే గాకుండా పూడికతో నిండి ఉంది. ఒకప్పటి జీవ నది నేడు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. అధికారులు నది విస్తరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– మహబూబ్‌బాషా, ఆత్మకూరు

రైతులకు ఎంతో ఉపయోగం



భవనాశి నదిని అభివృద్ధి చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నది ఒడ్డున ఉన్న ఆకు తోటలతో పాటు, ఇరువైపులా రైతులు సాగు చేసే మొక్కజొన్న, పత్తి, మినుము, తదితర పంటలకు ఎంతగానో సాగునీరు అందుతుంది. రైతులకు ఎంతగానో ఉపయోగపడే నదిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

– శివనాయక్, ఎస్ఎస్ తండా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వెలుగోడు: లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల చెక్కులను అందజేశారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శ్రీశైలంలో 'పారిశుధ్య స్వచ్ఛసేవా'

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పారిశుధ్య స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృత పారిశుధ్య చర్యలు చేపట్టారు. రథశాల నుంచి నందిమండపం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు ప్రధాన రహదారులు, ఆరుబయలు ప్రదేశాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, ఏఈఓలు వెంకటేశ్వరరావు, మల్లికార్జునరెడ్డి, హరిదాసు, పర్యవేక్షకులు, పలు విభాగాల సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములు రీ సర్వే చేయండి

- ఆర్డీఓ నాగజ్యోతి



రీ సర్వేను పరిశీలిస్తున్న ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి

పాములపాడు: అగ్రిగోల్డ్ భూములను రీ సర్వే చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి సూచించారు. గురువారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2005లో రైతుల నుంచి అగ్రిగోల్డ్ భూములను కొనుగోలు చేసిందన్నారు. ఈ భూములను గతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వేలో ఈ భూములను కూడా రీ సరే వచేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే సర్వే పకడ్బందీగా చేయాలని, రైతులతో సంయమనం పాటిస్తూ పూర్తి వివరాలు సేకరించుకుని సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, మండల సర్వేయర్ కలిముల్లా, వీఆర్వో ముర్తుజా ఉన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు పొందాలి





మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ, మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వైవీ మురళీకృష్ణ

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులు త్వరగా కౌలుకార్డులు పొందాలని ఏడీఏ ఆంజనేయ సూచించారు. క్రిష్ణాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో గురువారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాలను కౌలు తీసుకున్న రైతులు వీఆర్వోల ద్వారా కౌలు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఏఈఓలు లత, రాజశేఖర్, నరసింహారావు, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

- బండి ఆత్మకూరు: ఇతర రైతుల భూముల కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులు కౌలు గుర్తింపు కార్డు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీ కృష్ణ సూచించారు. మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో గురువారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగుదారు హక్కు చట్టం సెక్షన్ 3(8) ప్రకారం 11 నెలల కాల పరిమితితో కౌలుదారు భూ యజమానితో సాగు ఒప్పందం చేసుకుని కౌలు గుర్తింపు హక్కు పత్రం పొందవచ్చన్నారు. దీని ద్వారా ప్రభుత్వం అందించే ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం తదితర పథకాలకు అర్హత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వాతి పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో గురువారం విద్యుత్ తీగ తగిలి పాడి గేదె మృతిచెందింది. బాధిత రైతు జడల శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీ పక్కనున్న పొలంలో విద్యుత్ తీగ 15 రోజుల నుంచి తక్కువ ఎత్తులో వేలాడుతోంది. అటుగా వెళ్లిన గేదెకు తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. తక్కువ ఎత్తులో విద్యుత్ తీగ వేలాడుతోందని విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతోనే రూ.50 వేల విలువ చేసే తన గేదె మృతిచెందిందని రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ అబ్దుల్ అబీద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రెగ్యులర్‌గా ఇళ్లకు విద్యుత్ సరఫరా అయ్యే తీగ, న్యూట్రల్ తీగపై పడిందని, డిష్ కేబుల్ 1ప్లస్3 తెల్ల వైరు, సిల్వర్ బాక్స్ ద్వారా విద్యుత్ పాస్ కావడంతో గేదె ఆ తీగను తాకడంతో ప్రమాదం జరిగిందని చెప్పారు.

కొత్తపల్లి మండలంలో భారీ వర్షం



ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

- ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్ తీగలు
- విద్యుత్ అంతరాయం.. ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు

కొత్తపల్లి: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొత్తగా వేసిన విద్యుత్ తీగలు పాత విద్యుత్ తీగలపై పడి ఉదయం కూడా విద్యుత్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీరాపురం గ్రామం ఎస్సీ కాలనీ, యమలింగాపురం, నందికుంట గ్రామాల రోడ్లకు ఇరువైపులా ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 53.30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆత్మకూరులో 51.4 మి.మీ. వర్షం

ఆత్మకూరు: మండలంలో గురువారం వేకువజాము ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో మండలంలో 51.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గతనెల ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆత్మకూరు మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు. కాగా సాధారణం కంటే విస్తారంగా వర్షాలు కురవడంతో ఇప్పటికే రైతులు పొలాలను చదును చేసుకుంటున్నారు. వేసవి దుక్కులకు ఈ వర్షాలు ఎంతో అనుకూలమని రైతులు పేర్కొంటున్నారు.

పాములపాడులో 17.4 మిల్లీమీటర్లు

పాములపాడు: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆకాశంలో భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో ప్రజలను భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ నిలిపేయడంతో ప్రజలు ఉక్కపోతలతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బయట వర్షం ఇంట్లో ఉక్కపోతతో తెల్లార్లు జాగారణ చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలో 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనంది.

19న మాన్యం భూముల వేలం పాటలు

పాములపాడు: మండల కేంద్రంలోని దేవస్థాన భూముల బహిరంగ కౌలు వేలం పాటలు ఈనెల 19న నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెన్నకేశవ ఆంజనేయ స్వామి దేవస్థానం భూములు 31.09 ఎకరాలు, చౌడేశ్వరీ దేవత దేవస్థానం భూములు 19.08 ఎకరాలు, శ్రీనాగలింగేశ్వర స్వామి దేవస్థానం భూములు 12.97 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. చౌడేశ్వరీ దేవి ఆలయం ప్రాంగణంలో బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రూ.1,000 డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

తిరంగ్ ర్యాలీని జయప్రదం చేయాలి

పగిడ్యాల: ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ పాకిస్తాన్‌పై విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు చేపట్టనున్న తిరంగ్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొంటారన్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్

మహానంది: సేంద్రియ ఎరువులతో సాగు చేసి పండించిన ఉత్పత్తులకు డిమాండ్ ఉందని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. వ్యవసాయ కళాశాలలో గురువారం గోస్పాడు మండలానికి చెందిన ఎస్సీ రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులను వాడి వరి పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం ఒక్కో రైతుకు 200 కిలోల వానపాము ఎరువు, అజోస్పైరిల్లమ్, ట్రైకోడెర్మా, సూడో మోనాస్, జీలుగ విత్తనాలతోపాటు వ్యవసాయ పంచాంగం పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఐకార్ ప్రాజెక్ట్ హెడ్ రీసెర్చర్ డాక్టర్ పీవీ గీతాశిరీష, డాక్టర్ శివజ్యోతి పాల్గొన్నారు.

నక్కి రామన్న సేవలు మరువలేనివి

మహానంది: ప్రజా ఉద్యమ సారథి కామ్రేడ్ నక్కి రామన్న పేదలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఐ మండల కార్యదర్శి సామేలు, సీనియర్ నాయకులు రాజా కొనియాడారు. నక్కి రామన్న వర్ధంతి సందర్భంగా గురువారం బుక్కాపురంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి తుపాకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: అర్హులైన వీధి వ్యాపారులు ఈనెల 15 నుంచి 20వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అర్హులు అప్లికేషన్ ఫారం, ఆధార్, రేషన్ కార్డు, అకౌంట్ పాసు పుస్తకం, మొబైల్ నంబర్, పాస్‌ఫొటో, ఫ్యామిలీ ఫొటోతో కార్యాలయానికి రావాలన్నారు. ఐడీ కార్డు కోసం మున్సిపల్ కార్యాలయంలో రూ.150 చెల్లించి రశీదు పొందాలన్నారు. సర్వే అనంతరం దరఖాస్తులు పరిశీలించి వీధి వ్యాపారులకు గుర్తింపుకార్డు, వెండింగ్ సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు.

- నందికొట్కూరు: పట్టణంలోని వీధి వ్యాపారులు సంక్షేమ కార్యదర్శుల ద్వారా చేపట్టిన సర్వేలో పేర్లు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బేబి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారుల కోసం స్మార్ట్ స్ట్రీట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, పెండింగ్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తున్నామని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఎంపీపీ తిరుపాలమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపాలమ్మ

ఆత్మకూరు: మండలంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంపీపీ తిరుపాలమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలు లేవనెత్తారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కో–ఆప్షన్ సభ్యులు మౌలాలి మాట్లాడుతూ రీ సర్వేలో తమ గ్రామంలో తమకు 60 సెంట్ల పొలం తక్కువగా నమోదైందని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన తహసీల్దార్ రత్నరాధిక.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీపీ తిరుపాలమ్మ మాట్లాడుతూ కరివేన, కురుకుంద గ్రామాల్లో బోర్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగభూషణంశెట్టి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మనోహర్, ఆర్టీసీ కంట్రోలర్ సత్యనారాయణ, జెడ్పీటీసీ కురుకుంద శివశంకర్‌రెడ్డి, ఎంపీఈఓ లత పాల్గొన్నారుఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

- జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని సీపీడబ్ల్యూఎస్ స్కీములకు నిధులు మంజూరు చేయాలని 16వ ఆర్థిక సంఘం మెంబర్ సౌమ్య కాంతి ఘోష్‌ను కోరినట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గురువారం తిరుపతిలోని తాజ్ కృష్ణ హోటల్‌లో నిర్వహించిన లోకల్ బాడీ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లాపరిషత్‌కు నిధులు తక్కువగా ఉన్నందున సీపీడబ్ల్యూ ఎస్ స్కీము ద్వారా నాణ్యమైన నీరును సరఫరా చేసేందుకు ఇబ్బందిగా ఉందని, 16వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయించాలని సమావేశం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

సిద్ధేశ్వరం, గుండ్రేవులపై నోరు మెదపని ప్రభుత్వం

నంద్యాల(అర్బన్): సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం గుండ్రేవుల రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వం ఇప్పటికీ కార్యాచరణ చేయకపోవడంపై రాయలసీమ సమాజం తీవ్ర ఆవేదనలో ఉందని, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం మరువడం దారుణమన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో సిద్దేశ్వరం అలుగు 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 31న సంగమేశ్వరంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించిన గోడపత్రికలను సమితి సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదల వల్ల శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదస్థాయికి చేరిందన్నారు. ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. అలగనూరు, గోరుకల్లు రిజర్వాయర్లపై ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి నివేదికలు తెప్పించుకొని కార్యాచరణ చేపట్టాలన్నారు. శిథిలావస్థకు చేరకముందే సీమ ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్‌చేశారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కూర్నూలులో కాకుండా అమరావతికి తరలించడం దుర్మార్గమన్నారు. రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల క్షేత్రస్థాయి స్థితి గతులపై చర్చించడానికి సీఎం చొరవ చూపాలన్నారు. సమితి ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, న్యాయవాది అసదుల్లా, సుధాకర్‌రావు, భాస్కరరెడ్డి, కొమ్మా శ్రీహరి, కృష్ణ మోహన్‌రెడ్డి, రాముడు, జానోజాగో కన్వీనర్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గణపయ్య ఆకారంలో మర్రిచెట్టు కొమ్మ



జూపాడుబంగ్లా మండలం కొత్తసిద్ధేశ్వరం గ్రామ సమీపంలోని శివాలయం వద్ద పురాతనమైన బావి పక్కనే ఉన్న మర్రిచెట్టు కొమ్మ గణపయ్య ఆకారంలో ఉండటంతో పలువురు పూజలు నిర్వహిస్తున్నారు. మర్రి చెట్టు కింద శివలింగం, నందీశ్వరుడు కొలువై ఉన్నాడు. ఊడ మొదట్లో రెండు కనులు, తొండం కలిగినట్లుగా ఉండి చూసే వారికి అచ్చం వినాయకుని ప్రతిమను తలపిస్తుండటంతో గ్రామస్తులు మొదట వినాయకుని ప్రతిమను పోలిన మర్రిచెట్టు కొమ్మకు పూజలు చేసి తర్వాత శివలింగాన్ని దర్శించుకుంటున్నారు. – జూపాడుబంగ్లా